క్లుప్తంగా

అయోధ్య అక్షింతల పంపిణీ



శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని బొబ్బర్లపల్లిలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలో శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామ మందిర విశిష్టతను తెలిసేలా కరపత్రాలు అందజేయడంతోపాటు అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఇస్తెమాకు తరలిన ముస్లింలు



బళ్లారికి తరలివెళుతున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: బళ్లారిలో ఆది, సోమవారం నిర్వహించే ఇస్తాం ఆధ్యాత్మిక సదస్సు(తబ్లిగీ ఇస్తెమా)కు రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు తరలివెళ్లారు. రాయదుర్గం డివిజన్, బళ్లారి డివిజన్‌కు సంబంధించిన ఇస్తెమాను బళ్లారిలోని ఈద్గా మైదానంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రాయదుర్గం డివిజన్‌లోని కళ్యాణదుర్గం, హొస్‌కోట, కంబదూరు, శెట్టూరు, కణేకల్లు, మొలకాల్మూరు నుంచి ముస్లింలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులతోపాటు వ్యక్తిగత వాహనాల్లో వెళ్లారు. ఇస్తెమాకు బెంగళూరు నుంచి మత గురువులు హాజరై ఆధ్యాత్మిక బోధనలు చేయనున్నట్లు స్థానిక జమాత్ నిర్వాహకులు తెలిపారు.

నేత్రపర్వంగా భంభం బాబా ఉత్సవాలు



తెనగల్లులో గ్రామోత్సవ దృశ్యం

కుందుర్పి: మండలంలోని తెనగల్లు, కుందుర్పి, అప్పిలేపల్లి, కెంచంపల్లి, మహంతపురం తదితర గ్రామాల్లో ఆదివారం భంభం బాబా ఉత్సవాలు నేత్రపర్వంగా సాగాయి.గడిచిన 21 రోజులు ఉపవాస దీక్షలు చేపట్టిన భంభంబాబా భక్తులు ఆదివారం తమ ఉపవాస దీక్షలను విరమించారు. ఉదయం ఆయా గ్రామాల్లో భక్తులు పూర్ణకుంభాలతో స్వామి చిత్ర పటాలను గ్రామోత్సం నిర్వహించి భంభం బాబా ఆశ్రమాల్లో అఖండ భజన చేపట్టి అన్నదానం చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో విద్యా వ్యవస్థలో నూతన ఒరవడి



పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీదేవి

బెళుగుప్ప: నాడు-నేడుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని గుత్తి డివిజన్ డీవైఈఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని వెంకటాద్రిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆదివారం ఆమె పరిశీలించి, పూర్వ విద్యార్థులతో సంక్రాంతి ముచ్చట్లలో పాలుపంచుకున్నారు. నాడు-నేడు మొదటి దశలో మంజూరైన సుమారు రూ.42 లక్షల నిధులతో పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతులను డీవైఈఓ పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం బాలాజీ, ఎంఈఓ మల్లారెడ్డిలతో పాటు సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చిన పాఠశాల పూర్వ విద్యార్థులతో డీవైఈఓ మాట్లాడారు. ఉన్నత పాఠశాల స్వచ్ఛ విద్యాలయ్ పురస్కార్ 2021-22 అవార్డు సాధించడం గర్వ కారణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చారన్నారు. పంచాయతీరాజ్ జేఈ సుధాకర్, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత ఉపాధ్యాయులు, అధ్యాపకులు గంగాదర్, కిరణ్మయి, శ్రీరాములు, స్థానికులు అశోక్, ఆవులెన్న శ్రీనివాసులు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శ్రీకారం



వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలో ఆదివారం సర్పంచు మల్లెల జగదీష్ ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పెద్దమ్మ దేవాలయం సమీపంలో డ్రైనేజీ లేకపోవడంతో మెయిన్‌రోడ్డులో మురుగు నిల్వ ఉండి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో ఆదివారం పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు సర్పంచు ప్రారంభించారు. పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సంబరంగా సంక్రాంతి వేడుకలు



రాయదుర్గం: వేంకటేశ్వరుడి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మెట్టు, పార్టీ నాయకులు



రాయదుర్గం: వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో భోగి మంటల వద్ద నృత్యం చేస్తున్న చిన్నారులు, మహిళలు



రాయదుర్గం: గోదాదేవి, వేంకటరమణస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



రాయదుర్గంలో భోగిమంట

- ఊరూరా భోగి మంటలు
- ఆకట్టుకున్న రంగవల్లులు

రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజాము నుంచే భోగి మంటలు వేసి, బంధుమిత్రులతో కలసి ప్రజలు సంబరాల్లో మునిగితేలారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి సంప్రదాయ పద్ధతులు చాటుకున్నారు. మహిళలు రంగవల్లులతో వాకిళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. పోటాపోటీగా ముగ్గుల ప్రదర్శన చేపట్టారు. గొబ్బెమ్మలను పెట్టి హరిదాసులకు స్వాగతించారు. ఘుమఘులాడే పిండివంటలు తయారుచేస్తూ ఇంటిల్లిపాదీ అరగిస్తూ పండుగను సంతోషంగా చేసుకున్నారు. చిన్నారులు గాలిపటాలు ఉత్సాహంగా ఎగురవేశారు. యువత వివిధ పోటీల్లో పాల్గొన్నారు

రాయదుర్గం/టౌన్/కళ్యాణదుర్గం/బొమ్మనహాళ్/వజ్రకరూరు: రాయదుర్గం పట్టణంలోని ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలసి తెల్లారకనే భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రజలంతా సుఖ, సంతోషాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వెలిగించి కష్టాలు తొలగించాలని ఆలయాల్లో మొక్కుతీర్చారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, నాయకుడు పొరాళ్ల శివ, నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. ఏటాలాగే ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కుతీర్చారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, వజ్రకరూరు మండలాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నీలగిరిస్వామి ఆలయంలో పూజలు

వజ్రకరూరు మండల కేంద్రంలోని కురుబ వీధిలో ఉన్న నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు ఆకుపూజ, అర్చనలు, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో భోగి మంటలు వేసిన దృశ్యం



వజ్రకరూరులో..

ప్రజలకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: జిల్లా, ఉరవకొండ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదలచేశారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలతో గడపాలన్నారు. సకాలంలో వర్షాలు పడి, పంటలు సంవృద్ధిగా పండి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రతిఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందంగా చేసుకోవాలన్నారు.







బొమ్మనహాళ్, వజ్రకరూరు, కళ్యాణదుర్గం మండలం దొడగట్టలో ఇళ్ల ముందు ఆకట్టుకుంటున్న రంగవల్లులు



వజ్రకరూరులో నీలగిరిస్వామిని అలంకరించిన దృశ్యం

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సూచించారు. పట్టణంలోని తన నివాసం వద్ద గుమ్మఘట్ట, డి హీరేహాళ్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చరిత్రలో నిలిచిపోయేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదల బతుకుల్లో మార్పు తీసుకొచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబులా పెత్తందార్లకు కొమ్ముకాసేలా వ్యవహరించడం లేదన్నారు. పేదలకు జరిగే మేలును చంద్రబాబు చూసి ఓర్వలేకపోతున్నాడన్నారు. జగన్ సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు ఉంటాయన్నారు. టీడీపీ నాయకులు చెప్పే కల్లిబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలంటూ ఇంటింటా ఓటర్లకు విజ్ఞప్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న పెరుగుతున్న మద్దతు చూసి టీడీపీలో వణుకు పుట్టుకొస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాయదుర్గం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని పలు టీ కొట్ల వద్దకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వారితో కలసి టీ-తాగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమాన్ని నిలుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, ఆయా మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు పొరాళ్ల శివ, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, సోములాపురం సుదర్శనరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, గ్యాస్ క్రిష్ణ, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లిలో రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేయనున్నారు. అలాగే 11.30 గంటలకు శెట్టూరు మండలం యాటకల్లులో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

21న ఉచిత వైద్య శిబిరం

కూడేరు: అనంతపురానికి చెందిన శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మండల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువకుడి మృతి

విడపనకల్లు: మండల కేంద్రంలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన తలారి తిప్పన్న(26) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం కోనాపురం బాలిరెడ్డికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం సెబ్ పోలీసులు పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో రాయదుర్గం అర్బన్ పీఎస్ లో అప్పగించారు. అనంతరం సీజ్ చేసిన ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమాన విధించి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మన్న మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే ఎంతటి వారైన సరే వదిలిపెట్టేది లేదన్నారు. పట్టణంలోకి వచ్చే ప్రతి ట్రాక్టర్‌పై నిఘా ఉంచుతామన్నారు. సరైన ఆధారాలు లేకపోతే సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు.

అందుబాటులో సేంద్రియ పదార్థాలు

కుందుర్పి: కుసుమ గిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (సీఎస్‌సీ) సౌజన్యంతో మండల కేంద్రంలో సేంద్రియ ఆహార పదార్థాలు, పంటలకు పిచికారీ చేసేందుకు సేంద్రియ కషాయాలను అందుబాటులో ఉంచినట్లు ఆ సంస్థ మండల కోఆర్డినేటర్ నరసింహమూర్తి తెలిపారు. అలాగే రైతులు పండించిన పండ్లు, ఆహార ధాన్యాన్ని మార్కెట్ ధరలకే సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నామన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

కుందుర్పి: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగా సందర్భంగా తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్ మారుతేశ్వరి ట్యాంకర్ల ద్వారా గ్రామానికి నీరందిస్తున్నారు. మిట్టపై ఉన్న ట్యాంకులకు తాగునీరు సరఫరా కాకపోవడం, మరోవైపు శ్రీరామిరెడ్డి మంచినీటి పథకం కార్మికులు సమ్మెలో ఉండడంతో ప్రజల దాహార్తి తీర్చాలని ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రతి కాలనీకి నీరు అందిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. త్వరలోనే బోరు వేయించి వేసవిలో తనీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తీరిన లోఓల్టేజీ సమస్య

- సబ్‌స్టేషన్ ప్రారంభమయ్యాక నాణ్యమైన విద్యుత్ సరఫరా
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కూడేరు: అన్నదాతలకు అండగా నిలిచి వ్యవసాయాన్ని పండగలా చేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. వ్యవసాయానికి లోఓల్టేజీ లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఉమ్మడి జిల్లాకు సుమారు 43 విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో భాగంగా మండలంలోని తిమ్మాపురం-పి. నారాయణపురం గ్రామాల 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. రెండు నెలల క్రితం (నవంబర్ 27న) ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఉషశ్రీచరణ్ సబ్ స్టేషన్ ప్రారంభించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సిబ్బందిని ఏర్పాటు చేసి రెండు రోజులు క్రితం సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు విద్యుత్ సరఫరా ప్రారంభించారు. కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధైర్యంగా పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



పి.నారాయణపురం-తిమ్మాపురం గ్రామాల మధ్య ప్రారంభించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

సబ్‌స్టేషన్ ప్రారంభమవడంతో కరుట్లపల్లి, తిమ్మాపురం, పి.నారాయణపురం, చోళసముద్రం, జయపురం గ్రామాల్లోని బోర్లకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. గతంలో లో ఓల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతుండడంతో రైతులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ ఎనిమిది గంటల పాటు సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా



రబీలో బోరు కింద ఐదు ఎకరాల్లో వేరుశగన పంట సాగు చేశా. నూతన సబ్‌స్టేషన్ ప్రారంభించిన తర్వాత నాణ్యమైన విద్యుత్ మోటర్లకు సరఫరావుతోంది. స్ప్రింక్లర్ల ద్వారా పంటకు నీటిని అందిస్తున్నాం. గతంలో లో-ఓల్టేజీతో మోటర్లు తరచూ కాలిపోయేవి. ఇక ఆ ఇబ్బందులుండవు.

– గోవింద్ , రైతు, కరుట్లపల్లి

వ్యవసాయానికి 8 గంటల విద్యుత్



సబ్ స్టేషన్ పరిధిలో సుమారు 3,000 వరకూ బోర్లు ఉన్నాయి. వ్యవసాయానికి రాత్రి నాలుగు గంటలు, పగలు నాలుగు గంటలు చొప్పున కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. లో-ఓల్టేజీ సమస్యను అధిగమించాం. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవు.

– గౌస్ పీరా, ట్రాన్స్‌కో ఏఈ